క్లుప్తంగా

నేడు మడూరులో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండల పరిధిలోని మడూరు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలో ప్రజలందరికీ వైద్యురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. ప్రజలందరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారి చెప్పారు.

అధికారుల బాధ్యతా రాహిత్యమే కారణం

ప్రొద్దుటూరు : అధికారుల బాధ్యతా రాహిత్యం వల్లే ఇంటర్ ఫలితాల్లో జిల్లా వెనుకంజలో ఉందని పీడీఎస్‌యూ పట్టణాధ్యక్షుడు జి.విఘ్నేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 46 శాతం, సెకండ్ ఇయర్ ఫలితాల్లో 60 శాతం మాత్రమే ఉత్తీర్ణులు కావడంతో రాష్ట్రంలో చివరి నుంచి జిల్లాకు రెండో స్థానం దక్కిందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు కారకులైన ఆర్జేడీ, డీవీఈఓ, ఆర్ఐఓలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హింసతో సాధించేదేమీ లేదు

పోరుమామిళ్ల : దంతెవాడలో మావోయిస్టుల దమనకాండను జిల్లా ధర్మజాగరణ్ ప్రతినిధులు ఖండించారు. జిల్లా ప్రతినిధి శ్రీనివాసరెడ్డి శుక్రవారం మాట్లాడుతూ మావోయిస్టుల మారణకాండలో మృతి చెందిన పోలీసుల మృతికి సంతాపం తెలిపారు. దాడిలో పదిమంది పోలీసులు, డ్రైవర్ మృతి చెందడం దారుణమన్నారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని పలు సచివాలయాల సిబ్బందికి జమ్మలమడుగు డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సి.సుబ్రహ్మణ్యం షోకాజ్ నోటీసు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 14 సచివాలయాల సిబ్బంది ఈ-సర్వీసెస్ మొత్తాలను ప్రభుత్వ ఖాతాలకు జమ చేయనందున ఈ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. రూ.4,39,158 జమ కావాల్సి ఉందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్ సెక్రటరీలపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో తెలపాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో మే 1న ఉద్యోగ మేళా

పోరుమామిళ్ల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 1న సోమవారం జేకేసీ విభాగంలో చెన్నైకి చెందిన 'మద్రాస్ సిల్క్ ప్రైవేట్ లిమిటెడ్' వారు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నరేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సేల్స్ మెన్, సేల్స్ అసిస్టెంట్స్, సూపర్‌వైజర్, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల జేకేసీ విభాగంలో సంప్రదించాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు సర్టిఫికెట్లతో రావాలన్నారు.

నేటి నుంచి బి.మఠంకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : బ్రహ్మంగారిమఠం ఆరాధన ఉత్సవాల సందర్భంగా శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు బద్వేలు డిపో నుంచి 12 స్పెషల్ బస్సులు నడపనున్నట్లు బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు

బద్వేలు అర్బన్ : స్థానిక విద్యానగర్‌లో నివసిస్తున్న తనను ఇంటి నుంచి గెంటివేసి ఇళ్లు ధ్వంసం చేసినట్లు పి.లక్ష్మిదేవి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొంతమందిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

చిన్నారులకు స్వర్ణామృతపానం

బద్వేలు : పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం చిన్నారులకు రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు చిత్తా గిరి ప్రణీత్‌రెడ్డి స్వర్ణామృతపానం చుక్కలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానం అధ్యక్షుడు తులసి సురేష్‌బాబు ఆధ్వర్యంలో వీటిని చిన్నారులకు అందజేశామన్నారు. చిన్నజీయర్‌స్వామి చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి వర్ధకంగా స్థానిక వికాస తరంగిణి శాఖ ద్వారా ప్రతి నెలకు ఒకసారి పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

నాలుగేళ్లలో వంద కోట్లతో అభివృద్ధి పనులు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గడిచిన నాలుగేళ్లలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో దాదాపు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఇందు కోసం కృషి చేశారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వార్డుల వారిగా వివరించారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.968.21 లక్షలు, 2020-21లో రూ.2832.72 లక్షలు, 2021-22లో రూ.2439.03 లక్షలు, 2022-23లో రూ.3197.17 లక్షలు కలిపి మొత్తం రూ.9438.13 లక్షలతో మొత్తం 624 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటితోపాటు అదనంగా లైటింగ్, శానిటేషన్, వాటర్ వర్క్స్ పనులకు సంబంధించి రూ.3,27,75,450తో పనులు చేశామన్నారు. గత ప్రభుత్వాల్లో కేవలం ఏడాదికి రూ.10 కోట్లు మాత్రమే అభివృద్ధి పనులు చేస్తే గొప్ప అనిపించుకునేవారన్నారు. భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన మున్సిపల్ పాలకవర్గంతోపాటు అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ వైఎంఆర్ కాలనీ ఎంట్రన్స్ వద్ద నిర్మిస్తున్న మున్సిపల్ భవనాలకు సంబంధించి నాన్ రీఫండబుల్ విధానంలో ఐదేళ్లపాటు అద్దెకు ఇచ్చేందుకు అనుమతి కోరుతున్నామన్నారు. ఒక భవనానికి రూ.10లక్షలు, మరో భవనానికి రూ.రూ.7లక్షల మేరకు గుడ్‌విల్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడుతూ తన వార్డు పరిధిలోని సీవీ ప్రసాద్ అపార్ట్‌మెంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఏసీపీ పట్టించుకోవడం లేదని, కింది స్థాయి సిబ్బందికి కూడా ఆయన హెచ్చరికలు జారీ చేశారన్నారు. అనుమతులకు అదనంగా 14358 అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించారన్నారు శాఖా పరంగా ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి జోక్యం చేసుకుని అధికారులు, ప్రజా ప్రతినిధులు జోడెద్దుల్లాంటివారని, ఇరువురూ సంయమనంతో వ్యవహరిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మున్సిపల్ పెట్రోలు బంకులో పనిచేస్తున్న 19 మంది సిబ్బందికి వేతనాలను రూ.10వేల నుంచి రూ.12వేలకు పెంచాలని, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా అద్దంకి సుదర్శన్‌ను నియమించాలని తీర్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ ఖాజా, వార్డు కౌన్సిలర్లు, కమిషనర్ వెంకటరమణయ్య, అధికారులు పాల్గొన్నారు.

కాకర్లకు సముచిత స్థానం

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ న్యాయవాదిగా ఉన్న కాకర్ల నాగేశేషారెడ్డికి పార్టీ సముచిత స్థానం కల్పించిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీకి పనిచేసేవారికి గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. రాయలసీమ ప్రాంతాల పరిధిలోని 8 జిల్లాలకు సంబంధించి రిటైర్డు డీఎస్పీ కేవీ రాఘవరెడ్డి, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ సారెడ్డి శశిదేవితోపాటు న్యాయవాదిగా ఉన్న కాకర్ల నాగేశేషారెడ్డిని నియమించారన్నారు. పోలీసు ఫిర్యాదుల అథారిటీ సభ్యులు బాధితులకు అండగా నిలవాలని కోరారు. కాకర్ల నాగేశేషారెడ్డి మాట్లాడుతూ తనను నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం


ఫాతేహాలు చేస్తున్న పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ

జమ్మలమడుగు : హజరత్ సయ్యద్‌షా గూడుమస్తాన్ వలి దర్గా ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేలాది మంది భక్తులు స్వామి వారికి ప్రత్యేక చదివింపులు చేయించారు. ఢిల్లీకి చెందిన ఆలీమ్ ఆరీఫ్ సాబ్రి పార్టీ, చోటి షబ్నమ్ ఖవ్వాలి పోటీలు జరిగాయి. తెల్లవారు జామున ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆయన కుమారుడు సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషా ఖాద్రీలో గంధోత్సవాలను వేరువేరుగా నిర్వహించారు. డీఎస్పీ నాగరాజు, అర్బన్ సీఐ సదాశివయ్య , రూరల్ సీఐ కొండారెడ్డిల పర్యవేక్షణలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్టు కింద నాలుగు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సావిత్రమ్మ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చాపాడు ప్రాజెక్టు పరిధిలోని బి.మఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె - 1 సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), మద్దిరెడ్డిపల్లె అంగన్‌వాడీలో రెండు హెల్పర్ పోస్టులు (ఎస్సీ), చాపాడు మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లెలో అంగన్‌వాడీలో ఒక హెల్పర్(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మే 5లోగా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మైదుకూరు : ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ వర్కర్, 7 హెల్పర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఎస్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో మైదుకూరు మండలంలోని భూమాయపల్లె కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టు (ఓసీ), గడ్డంవారిపల్లె హెల్పర్ (ఎస్సీ), నల్లపురెడ్డిపల్లె హెల్పర్ (ఓసీ), మైదుకూరు 1 - హెల్పర్ (వీహెచ్), మైదుకూరు 6 - హెల్పర్(బీసీ-ఏ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సీడీపీఓ వివరించారు. ఖాజీపేట మండలంలోని సి.కొత్తపేట 1 - హెల్పర్ (ఓసీ), ఖాజీపేట 2 - హెల్పర్ (ఓసీ), పత్తూరు ఎస్సీ కాలనీ - హెల్పర్ (ఎస్సీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వర్కర్ పదో తరగతి ఉత్తీర్ణులై 1 జూలై 2023 నాటికి 21 ఏళ్లు పూర్తయి 35 ఏళ్ల లోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెల్పర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, దరఖాస్తులను మే 3వ తేదీలోపు మైదుకూరు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నైపుణ్యం ఉంటే విజయం మీ వెంటే


మాట్లాడుతున్న వింగ్ కమాండర్ సజ్జాచైతన్య

బద్వేలు అర్బన్ : ప్రస్తుత పోటీ యుగంలో విద్యార్థుల్లో విద్యతో పాటు ఆయా అంశాల్లో నైపుణ్యం పెంపొందించుకుంటే విజయం మీ వెంటే ఉంటుందని ఎయిర్‌వింగ్ కమాండింగ్, రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ సజ్జాచైతన్య తెలిపారు. శుక్రవారం రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థులకు ఎయిర్‌ఫోర్స్, డిఫెన్స్ ఉద్యోగ అవకాశాలపై స్థానిక నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాయుధ దళాల్లో యువత భాగస్వామ్యం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన అగ్నిపథ్, అగ్నివీర్ ఉద్యోగాలు విద్యార్థులకు సంజీవని లాంటివన్నారు. ఈ ఉద్యోగాల సాధనతో ఒకవైపు చదువుకుని మరోవైపు ఉపాధితో ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసే విధానం, పరీక్ష విధివిధానాలు, లభించే వేతనాలు, సౌకర్యాల గురించి వివరించారు. అలాగే రిజర్వేషన్లకు అతీతంగా ఎలాంటి రాతపరీక్షలు లేకుండా ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ కేడెట్స్‌కు అగ్నివీర్, డిఫెన్స్‌లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, జిల్లా యువజన సర్వీసులశాఖ అధికారి సాయిగ్రేస్, కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎయిర్‌వింగ్ ఆఫీసర్ అమిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

డి ఫారం పట్టాలు అమ్మినా, కొన్నా చర్యలు

దువ్వూరు : ప్రభుత్వం పేదలకు ఇచ్చిన డి ఫారం పట్టాలను అమ్మినా, కొన్నా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమకుమారి శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను కొందరు కొనడం, ఆక్రమించడం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గుడిపాడు గ్రామంలో జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను కొందరు దళారులు అనధికారికంగా ఇతరులకు అమ్మినట్లు సమాచారం ఉందని తెలిపారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఆయా గ్రామాల వీఆర్‌ఓలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి సదరు స్థలాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

అచలానంద ఆశ్రమానికి చేరిన రథం


రథంపై గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం : మండలంలో దాదాపు 36 రోజులుగా తిరుగుతున్న మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి రథం శుక్రవారం తోట్లపల్లెలోని అచలానందస్వామి ఆశ్రమానికి తిరిగి చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తోట్లపల్లె అచలానందస్వామి ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి ఆధ్వర్యంలో దాదాపు రూ.5 లక్షలతో వాహన రథం ఏర్పాటు చేయించారు. వీరబ్రహ్మేంద్రస్వామి గురించి సమీప గ్రామాల ప్రజలు మరువకూడదని, వారిని మేల్కొలిపేందుకు ఈ రథయాత్ర తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నుంచి తోట్లపల్లెలో ప్రారంభించారు. మండలంలోని దాదాపు 56 గ్రామాలలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశారు. ప్రతి ఊరిలో అపూర్వ స్వాగతం లభించింది. దేవాలయానికి వచ్చి స్వామిని దర్శించుకోలేని వారి చెంతకు.. దేవదేవుడే చేరుకుని ఆశీర్వదించారు. యాత్ర ముగిసిన సందర్భంగా శనివారం సాయంత్రం తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో బ్రహ్మంగారి వచనలు, సంఘ సంస్కర్త అనే అంశంపై భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇంటర్ విద్యార్థుల విజయభేరి


శారదా జూనియర్ కళాశాల విద్యార్థులు


నగదు బహుమతి అందుకుంటున్న నందిని



చక్రవర్తి, వినీత, దీప్తి జూనియర్‌కాలేజ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని పలు జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. స్థానిక అభ్యాస్ జూనియర్ కళాశాలలో ఎంపీసీలో 1000 మార్కులకుగాను 989 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన విద్యార్థిని ఎం.నందినికి కళాశాల యజామాన్యం ఉన్నత విద్యకోసం రూ.30వేలు నగదు బహుమతి అందించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ బచ్చల వీరప్రతాప్, ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, యూడీసీ రామకృష్ణారెడ్డి అధ్యాపకులు అభినందించారు.

- గీతాశ్రమంలోని ఎం.ఎస్ శారదా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 470 మార్కులకు గాను రామప్రియ 452, దివ్యతేజ 439, ఉన్నతి 430, రూపశ్రీ 410, సీఈసీ విభాగంలో 500 మార్కులను గాను ప్రియదర్శిని 422 మార్కులు సాధించింది. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.
- దీప్తి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో వినీత 464, ఉదయ్‌కుమార్ 463, సాయిహర్షిణి, సుచరిత 460, బైపీసీలో షాహిద్‌వలి 425, షభానా 424, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో చక్రవర్తి 986, సుప్రతిక్ 982, సంతోష్‌కుమార్ 979 బైపీసీలో మేఘన 981, నాగతేజ 975 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి, డైరెక్టర్లు బాలసుబ్బారెడ్డి, సునీల్‌బాబు, శ్రీనివాసరెడ్డి, ప్రదీప్‌రెడ్డి అభినందించారు.
- విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఎంపీసీలో ప్రవీణ 951, సుష్మ 918, బైపీసీలో ఆయేషా 957, జూనియర్ ఎంపీసీలో రుక్సానా 454, గీతాంజలి, ఇర్ఫానా 429, బైపీసీలో అయేషా 421, రిజ్వానా 420, సీఈసీలో యసీరా ఫిర్దోస్ 466 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ ఖాజామొహిద్దీన్, డైరెక్టర్ అలీఅక్బర్, సుదర్శనరెడ్డి అధ్యాపకులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్‌బీఐ పలు వస్తువుల వితరణ

ప్రొద్దుటూరు క్రైం : గోపవరం పంచాయతీ యానాది కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రొద్దుటూరులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఏడీబీ) శాఖ దత్తత తీసుకుంది. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి వాటర్ ట్యాంక్, టీవీ, అక్వా వాటర్‌ఫిల్టర్, రెండు బీరువాలు, ట్యాబ్, రంగులు, రాతి అల్మారా, కరెంటు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వీటిని ఎస్‌బీఐ (ఏడీబీ) చీఫ్ మేనేజర్ మోహన్‌రాజు, జోనల్ సెక్రటరీ సంజీవ ఆనంద్‌కుమార్, లోకల్ సెక్రటరీ గంగాధర్‌యాదవ్ ప్రారంభించారు. ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు గురునాథగుప్తా, అంగన్‌వాడీ కార్యకర్త రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్‌సెంటర్ తనిఖీ


హెల్త్‌సెంటర్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక గుంతపల్లె అర్బన్ హెల్త్‌సెంటర్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంత మంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అక్కడి నుండే డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లకు శ్రీకారం చుట్టిందని, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలోని అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు.

పని ఒత్తిడి దరిచేరనీయొద్దు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగాలు చేసే వారు పని ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పనిచేసుకోవాలని కడప మైండ్ కేర్ ఆసుపత్రి న్యూరో, మానసిక వైద్య నిపుణులు హరిత అన్నారు. కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం హెల్త్‌క్లబ్, సెక్సువల్ హరాస్మెంట్ , ఉమన్ ఎంపవర్మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పని భద్రత- ఆరోగ్యం దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పనిలో కలిగే ఒత్తిడి నుంచి బయటపడే మార్గాల గురించి వివరించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రధానాచార్యులు వీఎస్ ఎస్‌మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, హ్యూమానిటి అండ్ సైన్సెస్ విభాగాధిపతులు శ్రీవాణి సమన్వయకర్త ఆనంద్, రాధ పాల్గొన్నారు.

పోస్టల్ కార్మిక సంఘాల గుర్తింపు అప్రజాస్వామికం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోస్టల్ కార్మిక సంఘాల గుర్తింపును రద్దు చేయడం అప్రజాస్వామికం అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డూ అదుపు లేకుండా అమ్మేందుకే పోస్టల్ ఉద్యోగులకు సంబంధించిన రెండు ప్రధాన కార్మిక సంఘాల గుర్తింపు రద్దును రహస్యంగా చేసిందన్నారు.

శుద్ధి నీటి యంత్రం వితరణ

రాజుపాళెం : మండలంలోని పగిడాల గ్రామ పంచాయతీ కార్యాలయానికి అదే గ్రామానికి చెందిన గూడా వెంకట నారాయణరెడ్డి శుద్ధి నీటి యంత్రాన్ని శుక్రవారం వితరణగా ఇచ్చారు. అనంతరం ఆ యంత్రం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గూడా ప్రతాపరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు సగర కులస్తుల వివాహ పరిచయ వేదిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాజీవ్ సర్కిల్‌లోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సగరకులస్తుల ఆత్మీయ సమావేశం, ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు సగరసంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళీ తెలిపారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారిగా సగర జేఏసీ ఆధ్వర్యంలో సగర కులస్తులకు ఉచిత వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. సగర కులస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు తిరునాల

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పక్కన వెలసిన అభయాంజనేయస్వామి తిరునాల ఈనెల 30వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బండలాగుడు పోటీలు, కోలాటం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

బద్వేలు అర్బన్ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ బద్వేలు రూరల్ కార్యదర్శి ఇమ్మానియేల్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని శంకరాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రూరల్ నాయకులు ముకుంద, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వాసవీమాత జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతిని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు తెలిపారు. అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలతోపాటు సాయంత్రం లక్ష కుంకుమార్చన, అమ్మవారికి విశేషంగా వజ్రకిరీటంతో అలంకరించనున్నట్లు తెలిపారు. ఉదయం గాదం శెట్టి చెంచయ్య, పద్మావతమ్మ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య నిరుపేదలకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కనుల పండువగా అగస్త్యేశ్వర స్వామి కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వేకువజామున అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సుముహూర్తంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

పథకాల అమలు పక్కాగా ఉండాలి

బద్వేలు : ప్రభుత్వ పథకాల అమలును సమర్థవంతంగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్, తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల మండలంలోని సంచర్ల పంచాయతీ సచివాలయంలో సిబ్బంది, పలు పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సిబ్బంది ఎప్పటికప్పుడు చేరుకోవాలన్నారు. అనంతరం పక్కాగృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఇంజనీరింగ్ రంగంలో నైపుణ్యాన్ని సంపాదించి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూషా, ప్రిన్సిపాల్ ఉమాకాంతం, హెచ్‌ఓడీలు ప్రకాష్‌రావు, అయ్యవారయ్య, విజయలక్ష్మి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

గోపవరం : రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ కోరారు. శుక్రవారం శ్రీధనలక్ష్మి విత్తనాలు, పురుగు మందుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసి స్టాకు వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు.

అర్హతే ఆధారంగా పథకాలు అమలు

- పార్టీలు చూడకుండా సంక్షేమం అందిస్తున్నాం
- బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


సంక్షేమాన్ని తెలియజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నెర్రవాడ, బద్రిపల్లె, బద్రిపల్లె దళితవాడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, ప్రకాశ్, లక్ష్మీనారాయణ, ఓబులరెడ్డి, నరసింహారెడ్డి, జి.ఓబుళరెడ్డి, డీలర్ చంద్రల ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మూడు గ్రామాల్లో రఘురామిరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని తమ పార్టీకి ఓటు వేసినా వేయపోయినా సంక్షేమం ప్రతి ఇంటికి అందాలనే ఉద్దేశంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్లు నేరుగా ఇంటి వద్దకే వచ్చి అర్హతలను గుర్తిస్తూ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, జెడ్పీటీసీ కాంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు పుల్లయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు పద్దిరాజు, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామాంజనేయులరెడ్డి, హాజరత్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, టొరసానిరెడ్డి, రమణయ్య, ప్రసాద్, శంకర్‌రెడ్డి, చంద్ర, భూమిరెడ్డి నారాయణరెడ్డి, మహేష్‌యాదవ్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రబీ సీజన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా మంచి దిగుబడులు వచ్చాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నెర్రవాడలో రబీలో రైతు సాగు చేసుకున్న వరి పంటను ఆయన పరిశీలించారు. ధాన్యం ఆరబోసిన రైతు వెంకటరమణ ధాన్యాన్ని పరిశీలించారు.

ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, సంక్షేమం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బద్రిపల్లెలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బద్రిపల్లె పంచాయతీలో రూ.2.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రూ.7.80కోట్లతో ప్రజలతో సంక్షేమ పథకాలు అందాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హాయాంలో కేసీ కెనాల్ సాగునీటి కోసం ధర్నాలు చేయాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా సాగునీరు సకాలంలో అందుతోందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ సాగు నీరు ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని రఘురామిరెడ్డి కోరారు.